విధులను బహిష్కరించిన న్యాయవాదులు

కామారెడ్డి, మార్చి 25 : రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాది ఇజ్రాయిల్ హత్యను నిరసిస్తూ జిల్లా కోర్టులోని న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించారు. ఇటీవల కాలంలో న్యాయవాదుల పైన జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి రక్షణ చట్టాన్ని వెంటనే అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని కోరుతూ న్యాయవాదులు పోస్టుకార్డులు సీఎం కార్యాలయానికి పంపించామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీకాంత్ గౌడ్, జనార్దన్, భిక్షపతి, నరసింహారెడ్డి, సిద్దిరాములు, గోవింద్ రావు, గంగధర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైనవారు ఇండ్లు నిర్మించుకోవాలి

బాన్సువాడ రూరల్, మార్చి 25 : ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను ప్రారంభించాలని డీఎల్పీవో సత్యనారాయణరెడ్డి సూచించారు. బాన్సువాడ మండలం నాగారం గ్రామంలో జిల్లా విద్యాధికారి, బాన్సువాడ మండల ప్రత్యేకాధికారి రాజుతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల వద్దకు వెళ్లి మాట్లాడారు. ఆయన వెంట మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ వాహబ్, పంచాయతీ కార్యదర్శులు నవీన్‌గౌడ్, సృజన్‌రెడ్డి, మాజీ సర్పంచు రాచప్ప, గ్రామ పెద్దలు దొడ్ల వెంకట్రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

నవ వధువు ఆత్మహత్య

బాన్సువాడ రూరల్, మార్చి 25 : బాన్సువాడ మండలంలోని కొల్లూరు గ్రామానికి చెందిన నవ వధువు వల్లెపు లక్ష్మి మంగళవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. బాన్సువాడ సీఐ అశోక్ తెలిపిన వివరాలు ప్రకారం కొల్లూరు గ్రామానికి చెందిన వల్లెపు లక్ష్మికి అదే గ్రామానికి చెందిన వెంకటేశ్‌తో గత నెల 23న వివాహం జరిగింది. ఇష్టం లేని పెండ్లి చేశారనే మనస్తాపంతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కుటుంబీకులు బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలి తల్లి ఒల్లెపు చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు

బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి

నస్రుల్లాబాద్, మార్చి 25 : నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన డేగం గంగాధర్(31) సోమవారం రాత్రి బైక్ అదుపుతప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ మంగళవారం తెలిపారు. మృతుడు బీర్కూర్‌లోని దుకాణంలో నిత్యావసర వస్తువుల కొనుగోలు చేసి బస్వాపూర్ గ్రామానికి తిరిగి వెళ్తుండగా బరంగేడ్గి గ్రామశివారులో బైక్ అదుపు తప్పి కింద పడడంతో మృతి చెందాడన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గడ్డి దగ్ధం

భిక్కనూరు, మార్చి 25 : మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో విద్యుత్ షాక్‌తో వరి గడ్డి దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన ఓ రైతు తన వ్యవసాయ బావి నుంచి ట్రాక్టర్‌పై గ్రామంలోకి గడ్డిని తీసుకొచ్చాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు వరిగడ్డికి తగలడంతో మంటలు అంటుకొని ట్రాక్టర్‌పై ఉన్న గడ్డి పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

రిటైర్మెంట్ డబ్బులు చెల్లించాలి

బాన్సువాడ టౌన్, మార్చి 25 : ఆర్టీసీ ఉద్యోగులు రిటైర్మెంట్ అయ్యి ఏండ్లు గడుస్తున్నా ఇంకా రిటైర్మెంట్ డబ్బులు చెల్లించడం లేదని, త్వరగా చెల్లించాలని బాన్సువాడ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి శంకర్ కోరారు. బాన్సువాడలోని ఆర్టీసీ డిపో ఎదురుగా ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. పదేండ్లుగా పోరాడుతున్నా ఈపీఎఫ్, కనీస పెన్షన్ రూ.7,500, డీఏను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కౌసర్, పండరి, మహమూద్, యేషయ్య, గంగారాం, మనోహర్, లక్ష్మారెడ్డి, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సౌకర్యాలు కరువు

- తాగునీరు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు
- ఎండలోనే గంటలకొద్ది వేచిఉంటున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న అధికారులు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఎండలో వేచిఉన్న ప్రజలు

కామారెడ్డి, మార్చి 25 : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రతి రోజూ రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వేసవి కాలం కావడంతో తాగునీరు, మరుగుదొడ్లు ఇతర సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎండలోనే గంటల కొద్దీ వేచిఉంటున్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మూడేండ్ల క్రితం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పాతరాజంపేట గ్రామ పంచాయతీలోకి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించారు. దీంతో పట్టణ ప్రజలకు దూరం కావడంతో కార్యాలయంలో ప్లాట్లు, ఇండ్లు, భూముల రిజిస్ట్రేషన్ కోసం ప్రతిరోజు వందలాది మంది వస్తుంటారు. కనీసం ప్రజలు కూర్చోవడానికి సరిపడా కుర్చీలు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించడం లేదు. మరుగుదొడ్లు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలం రావడంతో రిజిస్ట్రేషన్‌కు వచ్చే వారు ఎండలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

బాల్యవివాహాలను అడ్డుకోవాలి

మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ నాగరాణి

కామారెడ్డి, మార్చి 25 : జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్ ఫోరం భవన్‌లో మంగళవారం సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో బాలికలు, మహిళలపై అరాచకాలు, లైంగికదాడులు జరుగుతున్నాయని, వాటి నిర్మూలన కోసం ప్రజలు చైతన్యవంతులు కావాలని సూచించారు. బాల్యవివాహాలు చేసుకోవడంతో జీవితంలో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. వివిధ హెల్ప్ లైన్ నంబర్లు 100, 1098, 181, 1930, 15100లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్ స్వర్ణలత, మెప్మా పీడీ శ్రీధర్ రెడ్డి, లైట్ ఫర్ బ్లైండ్ స్వచ్ఛంద సంస్థ ప్రెసిడెంట్ మేదిని దేవి, సాధన సంస్థ కోఆర్డినేటర్ గిరిజ పాల్గొన్నారు.

క్యాలెండర్ అవిష్కరణ

లింగంపేట, మార్చి 25 : మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో మంగళవారం ముదిరాజ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజారాం బాల్‌రాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ సంఘానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు సంఘం తరపున సంఘ సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. జనాభాలో 50 శాతం ఉన్న ముదిరాజ్‌లు ఏకమై జాతిని ఏకం చేసి బీసీ డీలో నుంచి (ఏ)లో చేర్చే వరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల శాఖ అధ్యక్షుడు సాయిలు, శబరి ముదిరాజ్ సంఘం మండల శాఖ అధ్యక్షుడు అశోక్, అనిల్‌కుమార్, మనోజ్, కిషన్, సాయిలు, కృష్ణ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 15: మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. కళ్యాణి గ్రామానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా రూ.5 లక్షలు మంజూరు కావడంతో ప్రజల సౌకర్యార్థం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబా, మైదపు శ్రీనివాసులు, సంజీవులు తదితరులు పాల్గొన్నారు. ఆజామాబాద్ గ్రామానికి మంజూరైన రూ. 5లక్షల సీసీరోడు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు స్థానిక నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సాయిబాబు, గోపీకృష్ణ, గణేశ్, నగేశ్, పండరి, జీవన్, హజార్, చందు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలో పాలకవర్గం సమావేశం

నస్రుల్లాబాద్, మార్చి 25 : మండలంలోని భైరాపూర్ గ్రామంలోని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో పాలకవర్గం సమావేశం విండో చైర్మన్ సాయి శ్యామ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి భూమయ్య ఆదాయ, ఖర్చును చదివి వినిపించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు రాములు, రామకృష్ణ, సావిత్రి, శ్రీనివాస్, పండరి పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఆటో డ్రైవర్

బాన్సువాడ టౌన్, మార్చి 25 : పట్టణంలో ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్న లక్ష్మణ్ మంగళవారం తన ఆటోలో ప్రమాణం చేసిన ఓ మహిళా సెల్ ఫోన్‌ను మరిచిపోయింది. ఆ సెల్ ఫోన్‌ను ఆటో డ్రైవర్ స్థానిక పోలీసుస్టేషన్‌లో అందించాడు. ఫోన్ పోగొట్టుకున్న మహిళ వివరాలు తెలుసుకొని అందజేస్తామని పోలీసులు తెలిపారు.

సకాలంలో క్రమబద్ధీకరణ చేయించుకోవాలి

కామారెడ్డి, మార్చి 25 : దరఖాస్తుదారులు అనధికార లే అవుట్లలోని ప్లాట్లను సకాలంలో క్రమబద్ధీకరణ చేయించుకోవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. లే అవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం ఈ నెల 31వ తేదీతో ముగుస్తుందన్నారు. దరఖాస్తుదారులు త్వరగా ఫీజు చెల్లించి 25 శాతం రిబెట్ పొందవచ్చని సూచించారు. దరఖాస్తుదారులు రుసుము చెల్లించిన 48 గంటలోనే ప్రొసీడింగ్స్ జారీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, డిప్యూటీ ఈఈ వేణుగోపాల్, టౌన్ ప్లానింగ్ అధికారి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

తైబజార్ వేలం

రాజంపేట్/బాన్సువాడ టౌన్, మార్చి 25 : రాజంపేటలో తైబజార్ వేలాన్ని గ్రామస్తుల సమక్షంలో ఎంపీడీవో రఘురాం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించినట్లు గ్రామ కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. 2025-26 సంవత్సరానికిగాను వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన మీర్ అప్సర్‌అలీ రూ.2 లక్షల 80 వేలకు దక్కించుకున్నట్లు తెలిపారు. బాన్సువాడలో తైబజార్ వేలాన్ని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కమిషనర్ శ్రీహరి రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. మేకలు, గొర్రెల సంతను రూ.46 లక్షల 26 వేలకు జంశేర్‌ఖాన్ దక్కించుకున్నాడు. రోజువారీ సంతను రూ.9లక్షల 2 వేలకు ప్రీతంరెడ్డి, వార సంతను రూ.12 లక్షల 31 వేలకు జగన్‌మోహన్‌రావు, ధాకాల చిట్టిని ప్రీతం రెడ్డి రూ.20 వేలకు దక్కించుకున్నాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాచారెడ్డి, మార్చి 25 : పాల్వంచ మండలంలోని లోట్టి వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. వాడి శివారులోని లోట్టి వాగు నుంచి ఇసుక ను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే డయల్ 100 ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

వీల్‌చైర్ అందజేత

కామారెడ్డి, మార్చి 25 : జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో వృద్ధులు, దివ్యాంగ ప్రయాణికుల సౌకర్యార్థం రోటరీ క్లబ్ సభ్యుడు సుభాష్ చంద్ జైన్ వీల్ చైర్‌ను అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు రాజనర్సింహారెడ్డి, రోటిరియన్స్ అసిస్టెంట్ గవర్నర్ జైపాల్‌రెడ్డి, ధనుంజయ, శ్రీశైలం, డాక్టర్ బాల్‌రాజ్, సుధాకర్ రావు, నాగభూషణం, చంద్రశేఖర్, కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి కృష్ణహరి, శంకర్, రైల్వే స్టేషన్ మాస్టర్ సత్యం, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇండ్ల నిర్మాణ పనుల పరిశీలన

భిక్కనూరు, మార్చి 25 : మండలంలోని ర్యాగట్లపల్లి గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

భిక్కనూరు, మార్చి 25 : మండలంలోని జంగంపల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో కామారెడ్డి పోలీస్ కళా బృందంచే మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అపరిచిత వ్యక్తులు, సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ హరిత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతను పాటించాలి

బాన్సువాడ, మార్చి 25 : దవాఖాన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని వంద పడకల మాతా శిశు, ఏరియా దవాఖానలో నూతనంగా చేపట్టిన భవన నిర్మాణ పనులను ఆమె మంగళవారం పరిశీలించారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

లింగంపేట, మార్చి25: మండలంలోని కోర్పోల్ గ్రామానికి చెందిన గుడ్డోళ్ల సులోచన (32) వేధింపులు భరించలేక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై ప్రకాశ్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఐలాపూర్ గ్రామానికి చెందిన సులోచనకు కోర్పోల్‌కు చెందిన కుమార్‌తో 2018లో రూ. రెండు లక్షల నగదు, రెండున్నర తులాల బంగారం ఇచ్చి వివాహం చేశారు. ఇద్దరు పిల్లలు పుట్టాక బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. హైదరాబాద్ నుంచి కోర్పోల్‌కు వచ్చిన సమయంలో అత్త సంగవ్వ, ఆడపడుచు సాయవ్వ, భర్త కుమార్, బావ రవి, తోటి కోడలు లలిత మానసికంగా వేధించారు. ఈ విషయాన్ని ఆమె తన తల్లిదండ్రులకు చెప్పగా పంచాయితీ నిర్వహించి సర్దిచెప్పి తిరిగి పంపించారు. అయినా వేధింపులు తప్పకపోవడంతో మూడు నెలల క్రితం ఐలాపూర్ గ్రామానికి వచ్చింది. వేధింపులు భరించలేక ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెకు కుమారుడు అభినయ్, కూతురు దీక్షిత ఉన్నారు. మృతురాలి తండ్రి బిక్కల బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం

రాజేశ్వరి (ఫైల్)

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 25: కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన మహిళ అదృశ్యమైన ఘటన ఎల్లారెడ్డిలో జరిగింది. ఎస్సై తెలిపిన ప్రకారం.. ప్రకాశం జిల్లా పామూరు మండలం రావిగుంటపల్లి గ్రామానికి చెందిన ఎండ్లూరి ఆశీర్వాదం అనే వ్యక్తి మూడేండ్లుగా ఎల్లారెడ్డి పట్టణంలో తాపీమేస్త్రీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. అతడికి సిద్దిపేట్‌కు చెందిన రాజేశ్వరి అనే మహిళతో ఆరేండ్ల క్రితం వివాహమైంది. ఇద్దరికీ ఇది రెండో వివాహం. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. రెండు నెలలుగా ఆశీర్వాదం భార్యాపిల్లలను ఎల్లారెడ్డిలో ఉంచి పని నిమిత్తం చెన్నైకి వెళ్లి వస్తున్నాడు. అప్పటి నుంచి భార్యాభర్తల మధ్య చిన్నచిన్న గొడవలు ప్రారంభమయ్యాయి. ఎప్పుడూ చూసినా భార్య ఫోన్ బిజీగా వస్తుండడంతో ఈనెల 19న ఎవరితో మాట్లాడుతున్నావు అంటూ ఆశీర్వాదం మందలించి రేపు ఇంటికి వస్తున్నాను అన్నాడు. ఈనెల 20న ఉదయం 7గంటలకు ఇంటికి వచ్చిన ఆశీర్వాదానికి ఇంట్లో భార్య కనిపించలేదు. భార్య సెల్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఇంటి ఓనర్‌తో మాట్లాడగా ఈనెల 19న మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయిందని తెలిపారు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. భర్త ఆశీర్వాదం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 25: రోడ్డును దాటుతుండగా ప్రైవేట్ టూరిస్ట్ బస్సు ఢీకొట్టడంతో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చోటు చేసుకొన్నది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొట్టాల్ గ్రామానికి చెందిన బోదాటి సాయవ్వ (43)మెదక్ జిల్లా మాసాయిపేట వద్ద రైలు దిగి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ప్రైవేటు బస్సు ఢీ కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కొట్టాల్‌లో ఆమె అంత్యక్రియలను కుటుంబ సభ్యులు మంగళవారం నిర్వహించారు.

ఆటోను ఢీకొట్టిన కారు : ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిరూరల్, మార్చి 25: ఎదురుగా ఉన్న బైక్‌ను తప్పించే ప్రయత్నంలో కారు ఆటోను ఢీకొట్టిన ఘటన మండలంలోని తిమ్మారెడ్డి శివారులో చోటు చేసుకొన్నది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం.. ఎల్లారెడ్డి నుంచి ఇద్దరు ప్రయాణికులతో ఆటో నిజాంసాగర్‌వైపు వెళ్తున్నది. ఆటో తిమ్మారెడ్డి శివారులోని కళ్యాణి ప్రాజెక్ట్ వద్దకు చేరుకున్న సమయంలో ఆరేడు నుంచి ఎల్లారెడ్డి వైపునకు వస్తున్న కారు ఎదురుగా ఉన్న బైక్‌ను తప్పించే క్రమంలో ఆటోను ఢీకొట్టింది. ఆటోలో ఉన్న అనిత అనే మహిళ కాలుకు, సునీత అనే మహిళ తలకు తీవ్రగాయమైంది. వీరిని ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

రేపు ఇసుక వేలం

నిజాంసాగర్, మార్చి 25 : మండలంలో అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు 3 ట్రాక్టర్ల ఇసుకను నిజాంసాగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో డంపింగ్ చేశారు. ఈ ఇసుకను ఈనెల 27న (గురువారం) ఉదయం 11 గంటలకు సంబంధిత ఇసుక డంప్‌ల వద్ద వేలం వేయనున్నామని, ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని తహసీల్దార్ భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జాజాల జన్మదిన వేడుకలు

ఎల్లారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే సురేందర్ జన్మదినం సందర్భంగా పటాకులు కాలుస్తున్న నాయకులు

రామారెడ్డి మండల కేంద్రంలో కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఎల్లారెడ్డిరూరల్/నాగిరెడ్డిపేట/రామారెడ్డి/రామారెడ్డి (గాంధారి)/ లింగంపేట/లింగంపేట(తాడ్వాయి), మార్చి 25: మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ జన్మదిన వేడుకలు మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మండల, పట్టణ అధ్యక్షులు జలంధర్‌రెడ్డి, ఆదిమూలం సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి, పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింహులు, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఇమ్రాన్, బర్కత్, అరవింద్‌గౌడ్, ఎరుకల సాయిలు, భూంగారి రాము, గోలి వసంతం, నాగం రాజయ్య, పృథ్వీరాజ్, గంగారెడ్డి, కోర్న నారాయణ, కిష్టారెడ్డి, రఘు వీర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గుర్రాల సిద్ధయ్య, ఎల్లారెడ్డి ఏఎంసీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి కేక్ కట్ చేశారు. పెద్ద ఎత్తున పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాల్తుమ్మెద విండో అధ్యక్షుడు దుందిగళ్ల నర్సింహులు, నాయకులు వెంకట్‌రెడ్డి, సంతోష్‌గౌడ్, రాజిరెడ్డి, హన్మంత్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, వంశీగౌడ్, ఫరీద్, కాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ జన్మదినం సందర్భగా మండల బీఆర్ఎస్ నాయకులు కేక్‌కట్ చేసి సంబురాలు నిర్వహించారు. కాళభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, మండల మాజీ రైతుబంధు కన్వీనర్ గురుజాల నారాయణరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బానూరి నర్సారెడ్డి, సీనియర్ నాయకులు పడిగెల శ్రీనివాస్, ల్యాగల మహిపాల్, పోత్నూరి ప్రసాద్, జంగం లింగం, చందర్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. గాంధారి మండల కేంద్రంలోమాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు బస్టాండ్‌లో కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డిరాజు, నాగుల మల్లేశ్, కొమ్ముల రమేశ్, గొల్ల సాయిలు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ముస్తఫా తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ జన్మదిన వేడుకలను లింగంపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జరుపుకున్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దివిటి రమేశ్, పట్టణ అధ్యక్షుడు పోకల సాయిరాం, నాయకులు ముదాం సాయిలు, శ్రీకాంత్, మహిపాల్‌రెడ్డి, సాయాగౌడ్, విఠల్, గన్ను నాయక్, లక్ష్మణ్, రవీందర్ నాయక్, రమేశ్, శ్రీనివాస్, మల్లయ్య, పరందాములు, నర్సింహులు ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే జాజల సురేందర్ జన్మదినం సందర్భంగా తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బీఆర్ఎస్ పార్టీనాయకులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు రవీందర్‌రెడ్డి, రమేశ్‌రావు, ప్రభాకర్‌రావు, రాజిరెడ్డి పాల్గొన్నారు.

హైవేపై యూటర్న్‌ల కోసం తీర్మానం

గోపాల్‌పేటలో హైవే అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న స్థానిక నాయకులు, వ్యాపారులు, గ్రామస్తులు

నాగిరెడ్డిపేట, మార్చి 25: మండలకేంద్రం గోపాల్‌పేటలో హైవేపై ఐదు చోట్ల యూటర్నులను ఏర్పాటు చేయాలని కోరుతూ..హైవే అధికారులు, కాంట్రాక్టర్ సమక్షంలో గ్రామస్తులు తీర్మానం చేశారు. నూతనంగా హైవే రావడంతో..గోపాల్‌పేటలో రెండు కిలోమీటర్ల దూరం వరకు కేవలం బస్టాండ్ వద్ద మాత్రమే యూటర్న్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. మరో నాలుగు చోట్ల యూటర్న్ ఏర్పాటు చేయాలని కోరారు. అవసరం ఉన్న చోటును గుర్తించి గ్రామస్తుల నుంచి తీర్మాన పత్రం రాసి ఇస్తే దాన్ని హైవే ఉన్నతాధికారులకు అనుమతుల కోసం పంపిస్తామని అధికారులు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, ఎంపీ సురేశ్‌షెట్కార్ ద్వారా అనుమతుల కోసం ఉన్నతాధికారులతో మాట్లాడించేలా చూడాలని కోరారు. దీంతో స్థానిక నాయకులు, వ్యాపారులు, గ్రామస్తులు యూటర్న్‌ల ఏర్పాటు కోసం తీర్మాన పత్రం రాసి సంతకాలు చేశారు. కార్యక్రమంలో